పన్నులతో పనులు



ఎస్సార్బీసీ కాలువ

- నీటి తీరువా వసూలుపై ప్రభుత్వం దృష్టి
- పంట కాలువల మరమ్మతులకు వెచ్చించే యోచన
- గత ఐదేళ్లలో పన్ను వసూళ్లకే పరిమితమైన వైసీపీ
- రైతుల బాగోగులు పట్టించుకోని వైనం

నంద్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల కనీస అవసరాలపైన గత ప్రభుత్వం దృష్టి పెట్టిన పాపాన పోలేదు. పైగా నీటి తీరువా వసూలు విషయంలో అన్నదాతలను నానా ఇబ్బందులకు గురి చేసింది. చివరికి మెట్ట భూమి రైతులు కూడా నీటి తీరువా చెల్లించాల్సిందేనని ఒత్తిడి పెట్టింది. కాలువల్లో పూడికతీత తీయకుండా ఐదేళ్లపాటు కాలయాపన చేసిందే తప్ప రైతుల సాగు నీటి వ్యథలను ఏనాడూ పట్టించుకోలేదు. ఇవేమీ చేయకుండానే రైతుల దగ్గర నుంచి నీటి తీరువా వసూలు చేసి ఖజానా నింపుకుంది. గత ప్రభుత్వంలో రైతులు పడిన ఇబ్బందులను కూటమి ప్రభుత్వం గుర్తించి కాలువల బాగుపై దృష్టి పెట్టింది. రైతుల నుంచి పన్ను వసూలు చేసి తిరిగి వ్యవసాయ రంగానికి ఖర్చు పెట్టే విధంగా అడుగులు వేస్తోంది.

రైతులే స్వచ్ఛందంగా..

వైసీపీ ప్రభుత్వంలో రైతులే కాలువలను బాగు చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండి భారీ వర్షాలు కురిసిన సమయంలో అవి పొంగిపొర్లేవి. మురుగు నీరు పంట పొలాల్లోకి వచ్చి రోజుల తరబడి నిల్వ ఉండడంతో పైరు పాడైపోయేది. మొక్కుబడిగా పాలనా పరమైన అనుమతులు ఇచ్చిన పనులకు సైతం బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టింది. వసూలు చేసిన నీటి తీరువా మొత్తంతో ఆ బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఆ నిధులను పక్కదారి పట్టించడంతో రైతుల ఆవేదన ఆలకించే వారే లేకపోయారు



తెలుగు గంగ కాలువ

178 పనులు.. రూ.19.28 కోట్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే నీటి వనరుల శాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న కాలువల్లో పూడికతీత పనులతోపాటు గుర్రపు డెక్క తొలగించడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 178 పనులను గుర్తించింది. వాటి కోసం రూ.19.28 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ప్రస్తుతం వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైపోవటంతో నిధులు విడుదల కాలేదు. అవి విడుదల కాగానే కాలువలకు సంబంధించిన పనులను మొదలుపెడతామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

నీటి తీరువా కింద దాదాపు రూ.3 కోట్లు వసూలు..

నంద్యాల జిల్లాగా ఆవిర్భవించిన తొలి రెండేళ్లలో నీటి తీరువా కింద రైతుల నుంచి దాదాపు రూ.3 కోట్లను గత ప్రభుత్వం వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని తిరిగి సాగునీటి కాలువల బాగుతోపాటు ఇరిగేషన్ పనుల కోసమే ఖర్చు చేయాలి. అయితే ఆ నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించి రైతులను నిలువునా వంచించింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చివరి ఆయకట్టుకు నీరందక రైతులు లబోదిబోమన్నారు. డీఆర్సీ సమావేశంతోపాటు జడ్పీ సమావేశాల్లోనూ కాలువల పూడికతీతపై రైతులు వినతి పత్రాలు ఇచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా రైతులపై విపరీతమైన ఒత్తిడి తెచ్చి మరీ నీటి తీరువా కట్టించుకుంది. జిల్లా వ్యాప్తంగా ఎస్సార్బీసీ, తెలుగు గంగ, కేసీ కెనాల్ కింద దాదాపు ఐదు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వంలో ఈ మొత్తం విస్తీర్ణంలో దాదాపు 25 శాతం చివరి ఆయకట్టుకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు.



కేసీ కాలువ

నీటి తీరువా బకాయిలు దాదాపు రూ.2.3 కోట్లు

కాలువల బాగుపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతోపాటు నీటి తీరువా చెల్లించకుండా బకాయి ఉన్న రైతులు వాటిని చెల్లించాలని విజ్ఞప్తి చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.2.3 కోట్ల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. నీటి తీరువా చెల్లించడానికి ముందుకు వచ్చే రైతులకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రైతులు సంబంధిత అధికారుల వద్దకు వెళితే సరైన సమాధానం రావడం లేదని వాపోతున్నారు. సర్వర్ సమస్యలు కూడా వెంటాడుతుండడంతో వ్యవసాయ పనులు మానుకుని నీటి తీరువా కట్టడం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నీటి తీరువా చెల్లింపులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం కూడా ఉంది.



ఉపాధి హామీ పథకంలో రూ.1.43 లక్షల అవినీతి

బనగానపల్లె, సెప్టెంబరు 19: ఉపాధి హామీ పథకంలో రూ.1.43 లక్షల అవినీతి జరిగినట్లు అధికారులు తేల్చారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింది స్థాయి సిబ్బందికి రూ.9,869 పెనాల్టీ విధించారు. బనగానపల్లె మండలంలో జరిగిన రూ.13.04 కోట్ల పనులపై జాతీయ ఉపాధి హామీ పథకం మానిటరింగ్ అధికారి భాస్కర్‌నాయుడు, ఏపీడీలు అన్వరాబేగం, బాలాజీ నాయక్, ఎంపీడీవో నాగరాజు గురువారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఉపాధి కూలీలకు సంబంధించి మస్టర్‌లు వేయడంలో మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి చేసినట్లు గుర్తించారు. కొందరు వలంటీర్లు పనికి పోకున్నా పోయినట్లు మస్టర్లు వేసినట్లు తెలుసుకున్నారు. మొత్తం రూ.1.43 లక్షల అవినీతి జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే రూ.9869 కింది స్థాయి సిబ్బందికి పెనాల్టీ విధించారు.



బనగానపల్లె మండల స్థాయి బహిరంగ విచారణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, సెప్టెంబరు 19: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి గురువారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. సుంకేసుల నుంచి 2,280 క్యూసెక్కులు మొత్తం 2280 వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 879.30 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 184.6012 టీఎంసీలుగా నమోదయింది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేశారు.

అద్దాల మండపం సందర్శనకు అనుమతి

శ్రీశైలం, సెప్టెంబరు 19: శ్రీశైలం మహా క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలోని అద్దాల మండపాన్ని భక్తులు సందర్శించడానికి అధికారులు గురువారం నుంచి అవకాశం కల్పించారు. ఈ అద్దాల మండపంలో స్వామి, అమ్మవార్లను ఊయలలో పవళింపజేసి నిత్యం ఏకాంతసేవ క్రతువులను దేవస్థానం నిర్వహిస్తుంది. ఈ అద్దాల మండపాన్ని పునఃప్రారంభించి భక్తులకు సందర్శించే అవకాశం కల్పించినందుకు మల్లన్న భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అద్దాల మండపాన్ని పునఃప్రారంభిస్తున్న అర్చకులు, అధికారులు

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఇతర జిల్లా అధికారులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 19: స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, వివిధ శాఖాధిపతులు, కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంగా అన్ని శాఖల నుంచి ప్రణాళికలు తెప్పించుకోవాలని సీపీవోను ఆదేశించారు. సెప్టెంబరు 30 నాటికి మండల వారీ ప్రణాళికలు, అక్టోబరు 15లోగా జిల్లా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ విష్ణుచరణ్, సీపీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇది మంచి ప్రభుత్వం'



నంద్యాల రూరల్, సెప్టెంబరు 19 : ఇది మంచి ప్రభుత్వం నినాదంతో వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై శుక్రవారం నుంచి ఆరు రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసే కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రం విముక్తి చెందిందని, రూ.5కే అన్న క్యాంటీన్లతో కడుపు నింపే స్థితికి వచ్చిందని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం తొలి వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఆరు ముఖ్యమైన అంశాలతో కరపత్రం రూపొందించామని, ప్రభుత్వ లోగోతోనే కరపత్రాన్ని సిద్ధం చేశామని తెలిపారు. సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలతో మమేకమై ప్రజా పాలన సాగిస్తున్నామని అన్నారు.

వరద బాధితులకు రూ.2.22 కోట్ల విరాళం

సీఎంకు చెక్కు అందజేసిన టీడీపీ నేతలు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: విజయవాడ వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు శ్రీశైలం నియోజకవర్గం ప్రజల తరఫున రూ.2,22,70,749 భారీ విరాళాన్ని సీఎం చంద్రబాబుకు జిల్లా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండీ. ఫరూక్‌లతో కలిసి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అందజేశారు. గురువారం అమరావతిలోని సీఎంఓ కార్యాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్ పేరిట విరాళం చెక్కును అందజేశారు. అదేవిధంగా వరద సాయం అందించిన దాతల వివరాలను కూడా అందజేశారు. అంతకుముందు శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలతో సీఎం చంద్రబాబును సత్కరించి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, గోవిందరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, షాబుద్దీన్, మల్లికార్జునరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణ, అన్నారపు శేషిరెడ్డి, నరసింహారెడ్డి, ఉల్లి మధు, లింగారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, జనసేన పార్టీ నాయకులు అశోక్ పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు అందజేస్తున్న మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు

- రూ.5కే రుచికర భోజనం
- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో ప్రారంభమైన అన్న క్యాంటీన్

డోన్(రూరల్), సెప్టెంబరు 19: పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని కేవీఎస్ కాలనీలో గురువారం సాయంత్రం అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అన్న క్యాంటీన్ పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం అందరితో కలిసి ఎమ్మెల్యే అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చామన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందన్నారు. అన్న క్యాంటీన్ పథకాన్ని పేద వర్గాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేశ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికే హరికిషన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల కార్యదర్శి వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్యగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి, ఓంప్రకాష్, వెంకటనాయునిపల్లె సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.



ప్రజలు, అధికారులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

గోడు వినవా.. రాఘవేంద్రా..!



పూలచింత పంప్‌హౌస్ స్టేజి- 1

- పూలచింత పంప్‌హౌస్‌లో పరికరాలు చోరీ
- దిగువకు విడుదల కాని సాగు నీరు
- ఎండిపోతున్న పంటలు.. రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

నందవరం, ఆగస్టు 19: గురురాఘవేంద్ర ప్రాజెక్టును నమ్ముకుని పంటలను సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న పూలచింత పంప్‌హౌస్‌లో పరికరాలు ధ్వంసం కావడం, మరికొన్ని చోరీకి గురి కావడంతో నీటి పంపింగ్ చేయలేని పరిస్థితి. సాగునీరందక అయకట్టు రైతులు సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పూలచింత రిజర్వాయర్ ఫేస్-1 కింద 4500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి అప్పట్లో శ్రీకారం చుట్టారు. గంగవరం దగ్గర ఉన్న పంప్‌హౌస్ నుంచి పూలచింత రిజర్వాయర్‌కు సాగునీరు పంపింగ్ చేసి అక్కడి నుంచి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తారు. అయితే గతంలో పూలచింత ఫేస్-1లో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్, ఆయిల్‌ను గుర్తుతెలియని దుండుగులు దొంగలించారు. ఫేస్-1లో మరో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేస్తుందని అందులో నుంచి పూలచింత రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేయాలని రైతులు కోరుతున్నారు. రెండు మోటర్లు వదిలితేనే రిజర్వాయర్ నింపేందుకు ఆవకావం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఓ వైపు పంటలు ఎండిపోతున్నాయని ప్రస్తుతం ఒక్క మోటర్ నుంచి అయినా రిజర్వాయర్‌కు నీటిని వదిలిపెడితే పంటను కాపాడుకుంటామని రైతులు కోరుతున్నారు. పూలచింత రిజర్వాయర్‌ను నమ్ముకుని 4,500 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేసిన రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల ఈ పథకం కింద ఆయకట్టు రైతులకు సాగునీరందించాలని పంప్‌హౌస్ దగ్గర రైతులు ధర్నా చేశారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం రావడం లేదు.



నీళ్లు లేక ఇంకిపోయిన రిజర్వాయర్

రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

పూలచింత రిజర్వాయర్ పనుల కోసం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం పూలచింత ఫేస్-1లో 1,550 లీటర్లు ఆయిల్ దొంగతనం జరిగింది. అయితే మరో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు ఎస్టిమెంట్ వేసి పంపాం. నిధులు వస్తే వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రతి రైతుకు సాగునీరందిస్తాం. - శ్యాంబాబు, ఏఈ, జీఆర్‌పీ



అయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

పంట పోతోంది



రెండె కరాల్లో పత్తి, మరో రెండు ఎకరాల్లో మిరపను సాగు చేశా. అయితే ఇంత వరకు సాగునీరు మాత్రం రాలేదు. దీంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. అధికారులు సాగునీరు వదలకపోతే పెట్టుబడులు కూడా పోతాయి.
-లక్ష్మన్న, రైతు

అధికారులు పట్టించుకోవడం లేదు



మోటర్లు కాలిపో యిన, ఆయిల్, కాపర్ దొంగతనం జరిగిన అధికారులు పట్టించుకోరు. కనీసం ఒక్క వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేయలేదు. ఒక మోటర్ నుంచి నీటిని వదిలినా కూడా పంటలు బతుకుతాయి. నేను 5 ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టా. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.
-గోపాల్, రైతు

ఆటో బోల్తా.. ఒకరి మృతి

పత్తికొండ, సెప్టెంబరు 19 : వ్యవసాయ పనులకు కూలీలు వెళ్తున్న ఆటో బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా మిగిలిన వారు గాయాలపాలయ్యారు. పత్తికొండ పట్టణం 11వవార్డులో నివసిస్తున్న మహిళా కూలీలు గురువారం ఉదయం పత్తికొండ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పత్తిచేలో పనులు చేసేందుకు ఆటోలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోకు కొత్తపల్లి రహదారిలో బ్రిడ్జి సమీపంలో మోటార్‌సైకిల్ అడ్డురావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి (60) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108 అంబులెన్స్‌లో పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. అందులో నలుగురు మహిళలకు తీవ్రగాయాలు కావడంతో వారిని కర్నూలుకు తరలించారు. ఆటోడ్రైవర్‌తోపాటు మిగిలిన వారికి చికిత్సలు అందించి ఇంటికి పంపారు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వ్యక్తి గల్లంతు

హాలహర్వి, సెప్టెంబరు 19 : బాపురం వద్ద దాహం కోసం వెళ్లి సోమశేఖర్ (38)అనే వ్యక్తి ఎల్లెల్సీలో గల్లంతయ్యాడు. గురువారం పొలంలో పనిచేసి దాహం తీర్చుకోడానికి వెళ్లి కాలుజారి కాల్వలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శవం కోసం బంధువులు కాల్వలో ప్రయత్నంచినా దొరకలేదు.

జంట హత్యల కేసు కొట్టివేత

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 19: స్థానిక గిప్సన్ కాలనీలో జరిగిన జంట హత్యల కేసును కొట్టివేస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధీ గురువారం తీర్పు చెప్పారు. కర్నూలు నగరం గిప్సన్ కాలనీలోని తేజ డీలక్స్ అపార్టుమెంటులో ఉంటున్న పి.మధుసూదన్ రెడ్డి, పి.రమాదేవిలను నిందితులు వెంకటప్రసాద్, రోహిత్ కుమార్, నవీన్ కుమార్, సీతన్నలు 2013 డిసెంబరు 29న హత్య చేశారు. అనంతరం వారి వద్ద ఉన్న డబ్బు, నగలను దోచుకెళ్లారు. పి.మధుసూదన్ రెడ్డి తమ్ముడు పి.ధనుంజయరెడ్డి ఫిర్యాదు మేరకు కర్నూలు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో రెండో నిందితుడు రోహిత్ కుమార్ మృతి చెందగా మిగతా ముగ్గురు నిందితులపై విచారణ జరిగింది. అయితే కోర్టులో నేరం రుజువు కాకపోవడంతో నిందితులపై కేసును కొట్టివేస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది బి.మురళి మనోహర్ వాదించారు.

కారు ఢీకొని చిన్నారి మృతి

బనగానపల్లె, సెప్టెంబరు 19: కారు ఢీకొని గురువారం ఓ చిన్నారి మృతి చెంది. బనగానపల్లె పట్టణం కొండపేటలోని పింజరిపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మహమ్మద్‌అలీ, రెహనా దంపతుల కుమారుడు మూడేళ్ల చిన్నారి అబుకర్ సిద్దిక్ బంధువుల ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొంది. కారు తలపై పోవడంతో చిన్నారి అబుకర్ సిద్దిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బాలుడి మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాలుడు తండ్రి మహమ్మద్ ఆలీ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బనగానపల్లె, సెప్టెంబరు 19: బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ము రమేశ్ (28)అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్‌కు గ్రామంలో రూ.8.50 లక్షల అప్పులయ్యాయి. అవి తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురయ్యాడు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు వెదికినా ఆయన ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం నందవరం ఊరిబయట పొలాల్లో మునగ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు గుర్తిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య చౌడేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఉరివేసుకొని..

బనగానపల్లె, సెప్టెంబరు 19: బనగానపల్లె పట్టణంలోని పంచమపేటకు చెందిన దారా పెద్ద ఓబులేసు(40) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఓబులేసు వేధింపులు భరించలేక భార్య ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలోనే ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

మార్కెట్ కమిటీ సెక్రటరీగా జయలక్ష్మి



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 19: కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా జయలక్ష్మిని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందును అనంతపురం మార్కెట్ కమిటీ సెక్రటరీగా బదిలీ చేశారు. డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ సెక్రటరీల బదిలీలు డిప్యుటేషన్‌పై మాత్రమే కొనసాగాలని ఏడాది పాటు ఈ ఉత్తర్వులు అమవుతాయని పేర్కొన్నారు

ముగ్గురు వీఏవోల తొలగింపు

నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశాలు

పత్తికొండ, సెప్టెంబరు 19 : పొదుపు సంఘాలకు అనుసంధానంగా పని చేసే గ్రామైక్య సంఘాల ముగ్గురు వీఏవోలను జిల్లా అధికారులు తొలగించినట్లు ఏపీఎం మధుబాబుగౌడ్ తెలిపారు. పత్తికొండ పట్టణంలో ఒకే కుటుంబానికి చెందిన భార్యా భర్తలు, వారి కుమారుడు నిబంధనలకు విరుద్ధంగా వీఏవోలుగా కొనసాగుతున్నారు. పొదుపు సంఘాలకు రుణాలను ఇప్పించడంలో వీరు అవినీతికి పాల్పడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణకు రావాలంటూ జిల్లా పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఐదు నెలలు గడచినా ఈ ముగ్గురు వీఏవోలు విచారణకు హాజరుకాకపోవడంతో వారిని విధుల నుంచి తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. కాగా గ్రామైక్య సంఘాల పరిధిలో ఉండాల్సి సీఐఎఫ్ నిధులు రూ 25 లక్షలు వీరి హయాంలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై త్వరలో జిల్లా అధికారులు పత్తికొండలో విచారణకు రానున్నట్లు సమాచారం.

మడతపడిన పేగుకు ల్యాప్రోస్కోపిక్ సర్జరీ



రోగితో సర్జరీ యూనిట్-2 చీఫ్ రామకృష్ణ నాయక్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో రోగికి కోత లేకుండా ల్యాప్రోస్కోపిక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. హాలహర్వికి చెందిన 70 ఏళ్ల సావిత్రమ్మ కడుపు నొప్పి, లవణాలు తక్కువ రావడం వంటి సమస్యలతో కర్నూలు జీజీహెచ్ మెడిసిన్ విభాగానికి వచ్చారు. అక్కడి నుంచి గత నెల 28వ తేదీ జనరల్ సర్జరీ యూనిట్-2కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ ఆ యూనిట్ చీఫ్ డా.రామకృష్ణ నాయక్ రోగికి సీటీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. కడుపులో పేగు మడతపడి, చెడిపోయినట్లు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి కేసును ఓపెన్ సర్జరీ ద్వారా నిర్వహిస్తుంటారు. కానీ రోగి వృద్ధురాలు కావడంతో ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 4వ తేదీన ల్యాప్రో స్కోపిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. యూనిట్ చీఫ్ డా.రామకృష్ణ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.సాబీరా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చైతన్యవాణి, డా.మన్సూర్‌బాషా, డా.ప్రణీత, అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డా.సోమశేఖర్ నేతృత్వంలో రోగి కడుపులో ప్రేగు మెలిక పడిన ప్రేగు చెడిపోయిన బాగాన్ని ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో నిర్వహించారు. ఇలాంటి సర్జరీ కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి సర్జరీ అని పేర్కొన్నారు.

నేటీ నుంచి పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 20 నుంచి 29 వరకు పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షల కోసం 55 మంది దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో హాలు టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

1 నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్టు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 1 నుంచి క్యాన్సర్ పరీక్షల ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రి వైద్యులు ఇటీవల విశాఖపట్నంలో హెచ్‌బీసీహెచ్ అండ్ ఆర్‌సీలో అంకాలజిలో శిక్షణ తీసుకున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో గురువారాల్లో రోగులకు స్ర్కీనింగ్ టెస్టు నిర్వహించాలని వైద్యులను ఆదేశించామని చెప్పారు. ఇందు కోసం ప్రివెంటివ్ అంకాలజీ క్యాన్సర్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మామ దాడి చేశాడని కోడలు ఆత్మహత్య

సంజామల, సెప్టెంబరు 19: మామ దాడి చేశాడని కోడలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వసంతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుంతమల్ల ఉమాదేవి (35)పై మామ గుంతమల్ల శిఖామణి ఈ నెల 14న దుర్భాషలాడుతూ కాళ్ల, చేతులతో తన్నాడు. మనస్తాపానికి గురైన కోడలు ఉమాదేవి పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న బంధువులు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త నంద్యాల రైల్వేలో ట్రాక్‌మన్‌గా పని చేస్తూ వసంతాపురంలో కాపురం పెట్టి వారానికోసారి వచ్చి పోయే వాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. మృతురాలి తండ్రి పడిగల నాగేషన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

సీఎంఎఫ్‌ఎస్‌లోకి అక్రమ చొరబాటు



- కాంకరెన్స్ లేదంటూ తిరస్కరణ
- ఆర్‌యూ తీరుపై ఆడిట్ అధికారుల అసహనం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: రాయలసీమ యూనివర్సిటీలో సీఎంఎఫ్‌ఎస్‌లోకి అక్రమంగా చొరబాట్లపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. విద్యా ప్రమాణాలు మెరుగుపరచాల్సిన వర్సిటీలో పాలనకు తూట్లు పొడిచే తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో ప్రస్తుతం నాన్ టీచింగ్ ఉద్యోగులు 24 మంది ఉన్నారు. వీరికి ఎనిమిది నెలలుగా సీఎంఎఫ్ఎస్ ద్వారా ప్రభుత్వం జీతాలు చెల్లించాల్సి ఉంది. కానీ 24 మంది ఉద్యోగుల ఫైల్స్‌కు అప్రూవల్ లేదని, వీరికి సీఎంఎఫ్ఎస్ ద్వారా జీత, భత్యాలు చెల్లించడం కుదరదని ఫైనాన్స్ అడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గత 8 నెలలుగా వర్సిటీ ఇంటర్నల్ నిధుల నుంచి జీతాలను చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం వర్సిటీలో పని చేసే రెగ్యులర్ నాన్ టీచింగ్‌లోని 24 మంది ఉద్యోగులకు సీఎంఎఫ్ఎస్ ద్వారానే వేతనాలు ఇవ్వాలి. అలా కాకుండా వర్సిటీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వడాన్ని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఉన్నతాధికారితోపాటు మరో ఇద్దరిని సీఎంఎఫ్ఎస్ డేటాలోకి ఎక్కించుకోవడంపై ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన సీఎంఎఫ్ఎస్ అధికారులు తిరస్కరించడం వర్సిటీలో హాట్ టాపిగా మారింది. ఈ ముగ్గురికి సీఎంఎఫ్‌ఎస్‌లో ఎక్కించుకునేందుకు కాంకరెన్స్ (ఫైనాన్స్ అనుమతి) లేకుండా ఎలా పేర్లు అప్‌లోడ్ చేస్తారంటూ వివరణ కోరడం ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది.

56 జీవో ప్రకారం సీఎంఎఫ్‌ఎస్‌లోకి

56 జీవో ప్రకారం సీఎంఎఫ్ఎస్ డేటాలోకి పేర్లు ఎక్కించిన మాట వాస్తవ మే. కానీ ఉద్యోగులకు సంబంధించి సీనియార్టీ పాటించలేదన్న ఆరోపణలను పట్టించుకోనవసం లేదు. అంతా కరెక్టుగానే ప్రక్రియను చేపడుతున్నాం.
- వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ

సీఎంఎఫ్ఎస్ డేటా చొరబాటులో ఆందోళన చేపడతాం

సీఎంఎఫ్ఎస్ డేటాలోకి అక్రమంగా చొరబడి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం మంచి సంప్రదాయం కాదు. అవసరమైతే వర్సిటీలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. డేటాలోకి ఎక్కించిన ఉద్యోగులకు ఫైనాన్స్ అప్రూవల్ లేని వారిని జాబితా నుంచి వెంటనే పేర్లను తొలగించాలి.
- సోమన్న, జిల్లా అధ్యక్షుడు, ఏఐఎస్ఎఫ్

ఐదు కేంద్రాల ద్వారా ఇసుక సరఫరా



కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 19: జిల్లాలో ఐదు డిసిల్టింగ్ కేంద్రాల ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. అమరావతి నుంచి ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ప్రారంభం సందర్భంగా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసిల్టింగ్ పాయింట్ల ద్వారా ప్రతి రోజు 7,500 మెట్రిక్ టన్నుల ఇసుకను ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రవాణా చేయడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలకు కలిపి రోజూ 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక వరకు డిమాండ్ ఉందని, డిమాండ్‌కు తగ్గట్లుగా ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. అమ్మకపు ధరపై జీఎస్టీ తగ్గిన కారణంగా జిల్లాలో ఇసుక ధర రూ.326ల నుంచి రూ.320లకు తగ్గించామన్నారు. ఇసుక రీచుల వద్ద 1.5 కి.మీల నుంచి 2.కిమీ వరకు చూడగలిగే వీఆర్ కెమెరాలు ఏర్పాలు చేయగలిగితే మొత్తం ప్రక్రియను చూసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ అలాంటి కెమెరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, మైనింగ్ డీడీ రాజశేఖర్, డీటీసీ శ్రీధర్, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, సీ.బెళగల్ తహ సీల్దార్ విజయశ్రీ, సీపీవో హిమప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా వేదికలు : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలపై గురువారం నుంచి 26వ తేదీ వరకు ప్రజావేదికలు (గ్రామ సభలు) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం జిల్లా, మున్సిపల్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబరు 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ప్రజావేదికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించాలని జడ్పీ సీఈవోను, డీఎల్‌డీవోను ఆదేశించారు. సచివాలయ సిబ్బందిని హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేత



సీఎంకు చెక్కును అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పాణ్యం నియోజకవర్గంలో సేకరించిన నగదును ఎమ్మెల్యే గౌరు చరిత సీఎం నారా చంద్రబాబునాయుడుకు అందజేశారు. గురువారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో సీఎంను కలిసిన రూ.33.50 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే గౌరు చరితను సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాయపు యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కర్నూలు(రూరల్)సెప్టెంబరు 19: కర్నూలు నగరశివారు ప్రాంతాల్లో చెరువులు, అలుగు వంకలు, ప్రభుత్వ భూములు ఆక్రమించిన కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆద్వర్యంలో గురువారం నగరశివారులో కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు అనేక ప్రభుత్వ భూములను అక్రమించారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేయికలిపిన వైసీపీ నాయకులు, వారికి తోడుగా రెవెన్యూ అధికారులతో విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు ధారాదత్తం చేశారన్నారు.

రైతులకు పరిహారం పంపిణీ



నష్ట పరిహారం చెక్కులు అందజేస్తున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 19: ఏఎం గ్రీన్ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నష్ట పరిహారం అందజేశారు. గురువారం కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన తన స్వగృహంలో పాణ్యం మండలం కందికాయపల్లెకు చెందిన దాదాపు వంద మంది రైతులకు ఎకరానికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా పాణ్యం మండలం పిన్నాపురం గ్రీన్‌కో ప్రాజెక్టు నిర్మాణ పనుల వల్ల ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు నష్ట పరిహారాన్ని గౌరు వెంకటరెడ్డి పంపిణీ చేశారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.50 వేల చొప్పున 400 మందికి పరిహారం అందజేశారు.

రేపు సబ్ జూనియర్స్ ఆట్యాపాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్స్ బాల బాలికలకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఆట్యాపాట్యా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆట్యా పాట్యా సంఘం కార్యదర్శి బాల పవన్ గురువారం తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే అక్టోబరు 5, 6 తేదీల్లో నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 9393855460, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.



కాణిపాకం వినాయకుడికి మహానందీశ్వరుడి పట్టు వస్త్రాలు



కాణిపాకం వినాయక స్వామికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మహానంది ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు

మహానంది, సెప్టెంబరు 19: వినాయక చవితి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకుడికి మహానంది దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను గురువారం సమర్పించారు. మహానంది ఆలయం తరుపున ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల్ల మధు, వేద పండితులు, అర్చకులు వినాయకుని పట్టువస్త్రాలకు మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో కాణిపాకం వెళ్లారు. సాయంత్రం కాణిపాకం ఆలయం వద్ద వీరికి ఆలయ ఈవో పి. గురు ప్రసాద్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను ఈవో సమక్షంలో అక్కడి వేదపండితులకు అందజేసారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, సెప్టెంబరు 19: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొల్పిన దత్తాత్రేయ స్వామివారికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన హరికథ



హరికథ వినిపిస్తున్న ప్రమీలరాణి

శ్రీశైలం, సెప్టెంబరు 19: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం అన్నమయ్య జిల్లా, రాయచోటికి చెందిన కె. ప్రమీలరాణి, భాగవతారిణి బృందంచే హరకథ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భక్తమార్కండేయ హరికథ వినిపించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి: డీఎస్పీ



వాణాలలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పాములపాడు, సెప్టెంబరు 19: పీర్ల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. మండలంలోని వాణాల గ్రామంలో గురువారం నిర్వహించే మౌళాలిస్వామి సరిగెత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డీఎస్పీతో పాటు సీఐ సురేశ్ కుమార్, పాములపాడు ఎస్ఐ సురేశ్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గ్రామస్థులంతా ఐకమత్యంగా పండుగను చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పోలీస్ బందోబస్త్ చేపట్టాలని డీఎస్పీ ఎస్ఐకి సూచించారు.

ఆదర్శ పాఠశాలలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గడివేముల, సెప్టెంబరు 19: అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వేణుగోపాల్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 15 మంది విద్యార్థులకు లోపాలను గుర్తించారు. వారికి కంటి అద్దాల కోసం సిఫారసు చేశారు. అనంతరం కళ్లను సురక్షితంగా ఉంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ శైలజ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

నంద్యాల క్రైం, సెప్టెంబరు 19: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలు రైతు మురళీధర్ రెడ్డి (45) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గోస్పాడు మండల కేంద్రానికి చెందిన కౌలు రైతు మురళీధర్‌రెడ్డి వ్యవసాయంలో నష్టాలు వాటిల్లడం, అప్పులు తెచ్చి పంటలు వేయడం, పంట చేతికిరాక ఆర్థిక ఇబ్బందులకు గురికావడంతో ఈ నెల 16వ తేదీ పొలంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి నంద్యాల సర్వజన వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మెరుగైన వైద్య సేవలకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రామతులశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం



పగిడ్యాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు



మిడుతూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎంపిక పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఆత్మకూరు ఎంఈవో సురేష్ సూచించారు. ఆయన మాట్లాడుతూ అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గ క్రీడలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు. ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్, వైస్‌చైర్మన్ చంద్రలీల, క్రీడల కోఆర్డినేటర్ శంకర్ ఉన్నారు.

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల కోర్డినేటర్ శ్రీనివాసులు, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీవో నూర్జహాన్ అన్నారు. జూపాడుబంగ్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడప్రాంగణంలో మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా తదితర క్రీడలు నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు మూర్తి, రమేష్, యశోద, పీఆర్‌పీఈ బషీర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో జీఎస్ఎస్ రెడ్డి, ఎంఈవో ఫయిజున్ బేగం, ఎంఈవో-2 శ్రీనాథ్, టీడీపీ నాయకులు తువ్వా భగీరథ రెడ్డి, శివరామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఇద్రూస్, హెచ్ఎం సాయి తిమ్మయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంటేశ్వర్లు, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.



జూపాడుబంగ్లాలో...

పగిడ్యాల: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేలా క్రీడాకారులను తయారు చేయాలని ఎంఈవో సుబాన్ తెలిపారు. పగిడ్యాల జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంబించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మురళీమోహన్‌రెడ్డి, హెచ్ఎం మదుసూదన్, వ్యాయమ ఉపాధ్యాయులు, పీతాంబర్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి గడివేములలో..

గడివేముల: గడివేములలోని జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం విక్టర్ ఇమ్మానుయేలు తెలిపారు. 20న బాలురకు, 21న బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హి సేవా

ఆత్మకూరు, సెప్టెంబరు 19: పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. గురువారం స్వచ్ఛతా హి సేవా -2024 వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆత్మకూరు రూరల్: మండలంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులను భాగస్వామ్యం చేస్తూ, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, పారిశుద్యంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

నందికొట్కూరు రూరల్: మండలంలో స్వచ్ఛతా హి సేవా కారక్రమాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బ్రాహ్మణకొట్కూరులో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అంగన్‌వాడీ, సచివాలయం, గ్రామస్థులతో కలిసి నిర్వహించారు.

మహానంది: మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. పర్యావరణం.. పరిశుభ్రత కార్యక్రమాలను అధికారులు, సిబ్బంది పాల్గొని చేసారు.

కొత్తపల్లి: పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత ఉంటే రోగాలు దరిచేరవని అధికారులు ప్రజలకు వివరించారు. కొత్తపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్వచ్ఛతా హి సేవాలో భాగంగా నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

పగిడ్యాల: వేయకు చెత్త- చేయకు పాపం, అపరిశుభ్రతను నివారిద్దాం- వ్యాదులను నివారిద్దాం, పరిశుభ్రతను పాటిద్దాం- పర్యావరణంను కాపాడుద్దాం అంటూ నినాదాలు చేసుకుంటూ పగిడ్యాలలో ర్యాలీ నిరర్వహించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు: ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని అధికారులు అన్నారు. పాములపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నంద్యాల రూరల్: నంద్యాలలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాల స్వామివివేకానంద ఆడిటోరియంలో స్వచ్ఛతా హి సేవాలో భాంగా భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేస్తే చర్యలు'

కొత్తపల్లి, సెప్టెంబరు 19: బహిరంగ ప్రదేశాల్లో దూమపానం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి ఎస్ఐ కేశవ హెచ్చరించారు. గురువారం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి కొత్తపల్లిలోని పాఠశాల పక్కన సిగరెట్లు, బీడీలు విక్రయిస్తున్న కిరాణాన్ని తనిఖీ చేశారు. బీడీలు, సిగరెట్లు విక్రయిస్తున్న బంకు యజమానికి రూ.800 జరిమానా విధించారు.

సీఎం సహాయ నిధికి విరాళం



చంద్రబాబుకు చెక్కును అందజేసిన మౌలాలిరెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నంద్యాలకు చెందిన గురురాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి ప్రకటించిన రూ.2.50లక్షల చెక్కును గురువారం విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడుకు మౌలాలిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మౌలాలిరెడ్డిని సీఎం అభినందించారు. ఇటీవలే వెయ్యి కుటుంబాలకు పదికేజీల చొప్పున బియ్యం ప్యాకెట్లను రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడంపై సీఎం అభినందించారు.

నంద్యాల (కల్చరల్): వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు నంద్యాల పట్టణ సాయి యువసేన సంస్థ ప్రెసిడెంట్ రవి తదితరలు కలెక్టర్ రాజకుమారికి రూ.20 వేల చెక్కును అందజేశారు.

సీఐ కొట్టాడని రోడ్డుపై బైఠాయింపు



భూపాల్‌కు నచ్చజెప్పుతున్న పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబరు 19: ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తనను కొట్టారని ఆరోపిస్తూ భూపాల్ అనే వ్యక్తి పోలీసుస్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన రేషన్ బియ్యం వ్యాపారం చేసుకునే భూపాల్ గురువారం మద్యం తాగి పోలీసుస్టేషన్‌కు వెళ్లి పోలీసులపైనే దూషణలకు దిగాడు. అక్కడి పోలీసులు ఎంత చెప్పినా వినకుండా రెచ్చిపోయాడు. ఈ క్రమంలోనే ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి మందలించగా తనను కొట్టారని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్ ఎదుట కేజీరోడ్డుపై బైఠాయించి సుమారు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. విషయం ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ దృష్టికి వెళ్లడంతో ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది అతనికి నచ్చజెప్పి డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ డీఎస్పీ మందలించి పంపించినట్లు తెలిసింది. ఇదిలావుంటే భూపాల్‌పై రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి సుమారు 12 కేసులు ఉన్నట్లు తెలిసింది.

నీటి సరఫరా లేని పశువైద్యశాల

● ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



బండిఆత్మకూరు పశువైద్యశాల

బండిఆత్మకూరు, సెప్టెంబరు 19: బండిత్మకూరు పశువైద్యశాలకు నీటి సమస్య వెంటాడుతూనే ఉంది. మండల పశు వైద్యాధికారి అనూష మండల స్థాయి, పంచాయితీ కార్యదర్శికి ఎన్నిసార్లు మొరపెట్టినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఇటీవల మండల మీట్ లోనే సమస్యను ఏకరువు పెట్టారు. మండల మీట్ జరిగి 20 రోజులు అవుతున్నా సమస్య పరిష్కారం కాలేదు, పశువులకు వైద్య చికిత్సలు చేసిన అనంతరం నీటి అవసరం ఎంతో ఉంటుందని వైద్య సిబ్బంది చెప్పారు.

లోన్ యాప్ బాధితులను కాపాడాలి

● ఎస్పీకి ముస్లిం జేఏసీ నాయకుల వినతి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 19: లోన్‌యాప్ బాధితులను కాపాడాలని ముస్లిం జేఏసీ నాయకులు కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఖలీల్ అహమ్మద్ ఆత్మహత్య దుర్ఘటనను మరువకముందే మరొక లోన్ యాప్ బాధితుడు ఆత్మహత్యకు పాల్పడే అవకాశం ఉందని నంద్యాల ముస్లిం జేఏసీ దృష్టికి రావడంతో వారు అప్రమత్తమయ్యారు. జేఏసీ గౌరవాధ్యక్షుడు ఎస్ఎండీ అబులైస్, అబ్దుల్ సమ్మద్ వెంటనే బాధితుడిని కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాధితుడిని గురువారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వద్దకు తీసుకువెళ్లి ఫిర్యాదు చేయించారు. డబ్బులు ఇవ్వకపోతే తన ఫొటోతో పాటు కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలుగా రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తున్నట్లు బాధితుడు ఎస్పీ దృష్టికి తెచ్చాడు. తన దగ్గర వ్యాపారానికి డబ్బులేక మరో దారిలేక లోన్ యాప్‌లలో చిన్న మొత్తాలు రుణం తీసుకున్నానని, నెలనెలా కడుతున్నా రెండింతలు తన వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి ఇంకా ఇవ్వాలని తనను బ్లాక్ మెయిల్ చేసి వేధిస్తున్నారని చెప్పారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్‌కు అప్పగించారు. ముస్లిం జేఏసీ నాయకులు అబులైస్, అబ్దుల్ సమ్మద్‌ల చొరవను ఎస్పీ అభినందించారు. త్వరలోనే సైబర్ క్రైం పట్ల జేఏసీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అబులైస్ తెలిపారు.

'చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం'



శివపురంలో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి, సెప్టెంబరు 19: చిరుదాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. గురువారం మండలంలోని శివపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో పోషణ మహావేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిషోర బాలికలకు, బాలురకు రక్తహీనత, పౌష్టికాహారం, చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కోసం ప్రదర్శన స్టాల్స్‌ను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించి ఆడపిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదమ్మ, రాధాకుమారి, ఖాజామొహిద్దీన్, వసంతలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయండి'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కొత్తపల్లి, సెప్టెంబరు 19: కర్నూలులో ఈ నెల 22న జరిగే వాల్మీకుల రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం జిల్లా కార్యదర్శి మీనిగ రామకృష్ణ గురువారం పిలుపునిచ్చారు. ఏపీ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జాతీ ఎస్టీ సాధన కోసం, మోసపోయిన వాల్మీకుల జాతి కోసం మన భావితరాల కోసం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే వాటిపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు కర్నూలులోని జిల్లా పరిషత్ హాలులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క వాల్మీకులు, బోయ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరుతున్న వైసీపీ ఎర్రమఠం నాయకులు

నందికొట్కూరురూరల్, సెప్టెంబరు 19: టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో కొత్తపల్లె మండలంలోని ఎర్రమఠం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. గురువారం అల్లూరు గ్రామంలో మాండ్ర సమక్షంలో ఎర్రమటం గ్రామ వైసీపీ నాయకులు టీడీపీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, అరున్‌కుమార్, ఓబులేష్, నాగేశ్వరావు, దావీదుతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

● జూపాడుబంగ్లా మండలం పోతులపాడు గ్రామ వైసీపీ నాయకులు ఆ పార్టీ టీడీపీ నాయకుడు రవికాంత్ ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో శ్రీను, పుల్లయ్య, సాంబ, మారెన్న, సుంకన్న, లింగస్వామి తదితరులతో పాటు 20 కుటుంబాలు ఉన్నాయి. మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలి'



మోత్కూరులో పసుపు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వెలుగోడు, సెప్టెంబరు 19: పంటలకు సోకే తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారుల సలహాలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి, నంద్యాల జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయశాఖ అధికారి హేమలత అన్నారు. మండలంలోని మోతుకూరు, మాదవరం గ్రామాలలో పసుపు, వరి పంటలను గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటపొలాల్లో పురుగు ఉనికిని, చీడ పీడల ఉధృతి, వ్యాధి నిర్ధారణ పీడీఎస్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వానికి నివేదిక అందుతుందని తెలిపారు. యాప్ ద్వారా వచ్చిన సమాచారాన్ని డీఆర్సీ అధికారులు పరిశీలించి ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలకు అందజేస్తారన చెప్పారు. శాస్త్రవేత్తలు పంట సస్యరక్షణ చర్యలు ఆన్‌లైన్‌లో తెలియజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగలింగం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'క్షయవ్యాధి ప్రాణాంతకం కాదు'



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 19: క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, ఈ వ్యాధిపై ఎలాంటి భయాందోళన అవసరం లేదని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సీహెచ్‌వో మౌనిక సూచించారు. నల్లమలలోని పెచ్చెరువు గూడెంలో గురువారం 104 వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధి నివారణ, బీసీజీ టీకాపై గిరిజనులకు అవగాహన కల్పించారు. రవికుమార్ మాట్లాడుతూ 15 రోజులు మించి దగ్గు, విపరీతమైన జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం, క్షయ వ్యాధి లక్షణాలు అని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపించిన తొలిదశలోనే నిర్ధారించడం వల్ల ఇతరులకు సోకకుండా అరికట్టొచ్చని తెలిపారు. ధూమపానం, మద్యపానం అలవాట్లు ఉన్న వారికి క్షయ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సామక్క, ఆరోగ్య సిబ్బంది సూర్య 104 సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, సెప్టెంబరు 19: మహానంది దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పదకానికి రూ.25 వేలు విరాళం ఇచ్చినట్లు అన్నదానం ఇన్‌చార్జి రామశివ తెలిపారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి దేవస్థానం విరాళాల కౌంటర్‌లో విరాళం ఇవ్వగా దాతను స్వామి వారి శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

కుష్ఠు నివారణపై అవగాహన

పాములపాడు, సెప్టెంబరు 19: పాములపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. గురువారం ఆరోగ్యశాఖ డీపీఎంవో వెంకటేశ్ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున మాట్లాడుతూ కుష్ఠు రోగుల పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదని సూచించారు. చర్మంపై ఎలాంటి మచ్చలు ఏర్పడినా ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బైరెడ్డి జన్మదినం



ఆసుపత్రిలో బ్రెడ్డు, పండ్లు అందిస్తున్న నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 19: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని బైరెడ్డి నివాసంలో ఆ పార్టీ నాయకుడు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకరవాడ చిన్నవెంకటస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే బస్టాండ్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్ చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ సుకూర్, రమేష్, నాగన్న, సుధాకర్, మహేష్, అభిమానులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కొత్తపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాగశేషన్న, శంకర్‌రావు, పుల్లయ్యగౌడు, శ్రీనివాస నాయక్, గంగన్న పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి జన్మదినం సందర్భంగా జూపాడుబంగ్లాలో, పోతులపాడు, 80బన్నూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. నాయకులు సైఫుద్దీన్, సుంకన్న, వెంకటరమణ గౌడు, రామకృష్ణ, నరసింహ, రాము, పుల్లయ్య, శివానందరెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: ప్రాతకోట గ్రామంలో టీడీపీ నాయకుడు ఆల్లీవుసేన్ ఆధ్వర్యంలో, ముచ్చుమర్రి గ్రామంలో కాటం వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. నాయకులు దశరథరామిరెడ్డి, రామనాయుడు, బాలశివుడు, కరీం, బాబు ఉన్నారు.

పాములపాడు: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పుట్టినరోజు సందర్భంగా టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్ రమేశ్, బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు పీరయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, చింటు, ఈశ్వరయ్య, శివ యూత్ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పొలాలకు వెళ్లే దారేది?

- అధ్వానంగా మారిన కేసీ ఆయకట్టు రహదారులు
- పొలాలకు వెళ్లేందుకు రైతుల అవస్థలు



శిరివెళ్లలో గోతులమయంగా మారిన ఆయకట్టు రహదారి

శిరివెళ్ల, సెప్టెంబరు 19: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ ప్రధాన కాల్వతో పాటు ఉప కాల్వల కింద వేల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. శిరివెళ్ల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో వేలాది మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. పొలాలకు వెళ్లే రహదారులు ఛిద్రమై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా కేసీ ఉప కాల్వలకు అనుసంధానంగా ఉన్న ఆయకట్టు రహదారుల్లో గోతులు ఏర్పడడంతో ఎరువులు, కూలీలను తరలించు కునేందుకు, వ్యవసాయ పనులు చేపట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప ఆయకట్టు రహదారుల అభివృద్ధిని విస్మరించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల పునరుద్ధరణ పూర్తిగా గాలికొదిలేసిందని రైతులు వాపోతున్నారు.

సాగునీటి సంఘాలపై నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 2015లో టీడీపీ హయాంలో సాగునీటి సంఘాలకు చివరగా ఎన్నికలు నిర్వహించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంఘాలు నిర్వీర్యమయ్యాయి. దీంతో కేసీ కెనాల్ అభివృద్ధి పనులు, ఆయకట్టు రహదారుల పునరుద్ధరణపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. ఫలితంగా కేసీ ఆయకట్టు రైతులు అధ్వానంగా మారిన రహదారుల్లో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి రహదారులను పరిశీలించి వాటిని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

గోతుల్లో మట్టి కూడా వేయలేదు



కేసీ కెనాల్ కాల్వల వెంట ఉన్న రహదారులు గోతులమయంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల్లోని గోతుల్లో కనీసం మట్టి కూడా వేయలేదు. శిరివెళ్ల మెట్ట నుంచి వెంకటేశ్వరాపురం వరకు ఉన్న పంట పొలాల రహదారి దారుణంగా మారడంతో అవస్థలు పడుతున్నాం.

– పీపీ లింగమయ్య, రైతు, శిరివెళ్ల

రహదారులను పునరుద్ధరించాలి



కేసీ కెనాల్‌తో పాటు గ్రామాల్లోని చెరువుల ఆయకట్టు రహదారులను ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఉంటుంది. రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– కృష్ణ కిషోర్, రైతు, శిరివెళ్ల

గ్రామీణ రోడ్లపై కేంద్ర మంత్రికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19: గ్రామీణ రోడ్లపై కేంద్రానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రతిపాదనలు అందించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి గురువారం వెల్లడించారు. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామీణ రోడ్లకు సంబంధించి సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్ఐఎఫ్) కింద నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్స్, ట్రాన్స్‌పోర్ట్ మంత్రి నితిన్ గడ్కరీని కోరారని చెప్పారు. కొలిమిగుండ్ల మండలంలోని పేట్నికోట - పేరుసోముల వయా మీర్జాపురం రహదారికి సంబంధించి 12.60కి.మీగాను రూ.30కోట్లు, తిమ్మనాయినిపేట - కొలిమిగుండ్ల రహదారి 13.80కి.మీకు రూ.29 కోట్లు, సంజామల-కోవెలకుంట్ల, ముక్కమొల్ల-అవుకు రోడ్డు 11.38కి.మీకు రూ.23 కోట్లు, సంజామల-పేరుసోముల రహదారి 14.20కి.మీకు రూ.29 కోట్లు, పలుకూరు-కొత్తూరు-నందివర్గం రహదారి 10.60కి.మీకు రూ.22 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు అందజేశారని టీడీపీ నేతలు తెలిపారు. మొత్తం రూ.133.50కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారని వెల్లడిం చారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఇవన్నీ డబుల్‌లైన్ రోడ్స్ ప్రతిపాదనలు కావడంతో ఈ రహదారులు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వారు వివరించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19: కోవెలకుంట్ల వ్యవసాయ కేంద్రంలో 10.16.26, 20.20.0.13 ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు రబీలో ఎక్కువ శాతం శనగ, జొన్న సాగు చేశారని, వారు డీఏపీ ఎరువులు కాకుండా పోషకాలు గల ఎరువు వాడితే అధిక దిగుబడి వస్తుందన్నారు.

నేడు గుళ్లదుర్తికి మంత్రి బీసీ రాక

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19: మండలంలోని గుళ్లదుర్తిలో శుక్రవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా జరిగే ఈ సమావేశంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటారు.

చంద్రబాబు పాలనలోనే పేదలకు న్యాయం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని టీడీపీ యువ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కోవెలకుంట్ల పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలందక ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటి నెలలోనే రూ.7వేలు పింఛను అందించారన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ

బేతంచెర్ల, సెప్టెంబరు 19: నీట్ ఫలితాల్లో ఇందు ప్రసన్నలక్ష్మి 644 మార్కులు సాధించి ప్రతిభ చూపింది. మండలంలోని ఆర్ఎస్. రంగాపురం గ్రామానికి చెందిన చంద్రమోహన్ రావు, వరలక్ష్మి దంపతుల కుమార్తె ఇందు ప్రసన్నలక్ష్మి పదో తరగతిలో 578, ఇంటర్మీడియట్‌లో 985 మార్కులు సాధించారు. వైద్య వృత్తి చేపట్టాలనే ఆకాంక్షతో తొలి ప్రయత్నంలోనే నీట్‌లో ర్యాంకు సాధించి కర్నూలు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు ఇందు తెలిపారు. తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు ఆమెను అభినందించారు.

'అగ్రి ల్యాబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 19: ఆళ్లగడ్డలోని అగ్రి ల్యాబ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని పలువురు డీలర్లతో పాటు రైతుల నుంచి సేకరించిన ఎరువులను అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల అనంతరం మిగిలిన ఎరువులను అగ్రి ల్యాబ్‌లో గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, క్రిమిసంహారక మందులు పంపిణీ చేయడంలో భాగంగానే ఏటా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏడీఏ వెల్లడించారు. నంద్యాల వ్యవసాయశాఖ అధికారి కల్యాణ్‌రావు, ఆళ్లగడ్డ అగ్రి ల్యాబ్ అధికారి నాగేంద్ర ప్రసాద్, ఏఈవో నరసింహ, రేవతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య బాధాకరం

డోన్(రూరల్), సెప్టెంబరు 19: రుణ యాప్ బారిన పడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాధాకరమని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణ యాప్‌లతో బాధితులు నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

ప్యాపిలి ఎస్ఐగా మధుసూదన్

ప్యాపిలి, సెప్టెంబరు 19: ప్యాపిలి ఎస్ఐగా మధుసూదన్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి వీఆర్‌కు బదిలీ కాగా, కర్నూలు 3టౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న మధుసూదన్‌ను ప్రభుత్వం ప్యాపిలిలో నియమిం చింది. ఎస్ఐ మాట్లాడుతూ మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్యాపిలి, సెప్టెంబరు 19: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న ఎస్.సోనీని మండలంలోని ఏనుగుమర్రి ప్రభుత్వోన్నత పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. సుబ్బారెడ్డి, శాంతిప్రియ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



చంద్రబాబుతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 19: ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తైన నేపథ్యంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, కావాల్సిన నిధుల సమీకరణ గురించి సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు పలువురు మంత్రులను ఎమ్మెల్యే అఖిలప్రియ కలిసి చర్చించారు. వైసీపీ అసమర్థ పాలనను పారద్రోలి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిచిన సంక్షే పథకాలు, సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్



జయమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, సెప్టెంబరు 19: మండలంలోని కలచట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామాంజనేయులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావ యాదవ్ అన్నారు. మండలంలోని కలచట్ల గ్రామంలో మృతుడి కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. మృతుడి భార్య జయమ్మకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌యాదవ్, కలచట్ల ప్రసాద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలు అవసరం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

బేతంచెర్ల, సెప్టెంబరు 19: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల కృషి, పట్టుదల పెరుగుతుందని మండల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొలుములపల్లె గ్రామంలో మండల స్థాయి క్రీడల పోటీలు ఎంఈవో సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను బలపాలపల్లి సర్పంచ్ మద్దమ్మ ప్రారంభించారు. ఈ క్రీడల్లో అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా బేతంచెర్ల ఎంజేపీ పాఠశాల వినయ్, రామ్‌చరణ్, మురళి, జడ్పీహెచ్ఎస్ కొలుములపల్లి, రాహుల్, మనోజ్, జడ్పీహెచ్ఎస్ సీతారామాపురం చరణ్, నాగసురేష్, బేతంచెర్ల సుమేధ పాఠశాలకు చెందిన ఇద్రుస్ వలి, ముద్దవరం జడ్పీహెచ్ఎస్ కిషోర్, రంగాపురం ఎల్ల మధుకుమార్, సుమేధ పాఠశాలకు చెందిన గణేష్, అలాగే అండర్-14 బాలికల విభాగం లో ఖో-ఖోలో రన్నర్స్‌గా స్వాతి, శైలజ, కర్తిజాబి, అఖిల, షాజియా, హతీఫా, ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలిచారని కోఆర్డినేటర్ వెంకటేశ్ నాయక్ తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాలు

సంజామల, సెప్టెంబరు 19: క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని స్టేట్ రిసోర్స్ పర్సన్ సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్ అన్నారు. గురువారం పేరుసోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ ఈశ్వరయ్య, హెచ్.ఎం సీతారావమ్మ ప్రారంభించారు. సంజామల, ఆకుమళ్ల, ఆల్వకొండ, కమలపురి, కానాల, గిద్దలూరు, నొస్సం, పేరుసోమల ఉన్నత పాఠశాలకు చెందిన దాదాపు 450 మంది విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలయిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు బెలుం సురేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్న శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు ప్రతాప్, బాషా, మౌలాలి పాల్గొన్నారు.

'క్రీడాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

చాగలమర్రి, సెప్టెంబరు 19: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని విద్యా కమిటీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు మౌలాలి, జెట్టి నాగరాజు తెలిపారు. గురువారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన వారిని మండలస్థాయికి ఎంపిక చేస్తామని పీడీ దాదా పీర్ తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 24, 25 తేదీల్లో ఆళ్లగడ్డలో జరిగే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. హెచ్ఎం కోటయ్య, పీడీలు సుమన్, ఆశాజ్యోతి, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మౌళాలి, అనీఫ్, నూర్‌బాషా, సురేష్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పావని

అవుకు, సెప్టెంబరు 19: పౌష్టికాహారం తీసుకుంటే బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పావని, శివమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, సంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వారు వివరించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ జంక్ ఫుడ్ తినడంతో గ్యాస్, క్యాన్సర్ వ్యాధుల బారినపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంజామల: సమతుల ఆహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకొని కమలపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. చిరుధాన్యాల ప్రాధాన్యం గురించి వివరించారు.

చాగలమర్రి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్వీజీ ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలకు రక్తహీనత, పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. హెచ్ఎం ఇమ్మానుయేల్, సుజీవ్, అంగన్‌వాడీవర్కర్లు హసనమ్మ, ఆశీర్వాదమ్మ, అరుణజ్యోతి, మోక్షావతి పాల్గొన్నారు.

'ప్రజా వేదికను సద్వినియోగం చేసుకోండి'

దొర్నిపాడు, సెప్టెంబరు 19: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా వేదిక నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. 23 నుంచి 26వ తేదీ వరకు ఈ సమావేశాన్ని ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న అమ్మిరెడ్డినగర్, అర్జునాపురం, బుర్రారెడ్డిపల్లె, 24న చాకరాజువేముల, దొర్నిపాడు, గుండుపాపల, 25న కొండాపురం, క్రిష్టిపాడు, 26న డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి, ఆయా శాఖల అధికారులు హాజరవుతారని చెప్పారు.

22న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

చాగలమర్రి, సెప్టెంబరు 19: నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలను ఈనెల 22న చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతాయని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ దాదాపీర్ గురువారం తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలను తీసుకొని పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు.

మొక్కజొన్న పంటపై పందుల దాడి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 19: కొలిమిగుండ్ల సమీపంలోని తన పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటపై పందులు దాడి చేసినట్లు రైతు రాజనేని చిన్న మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి పందులు ఎకరం పంటను తొక్కి నాశనం చేశాయని, అధికారులు తనకు న్యాయం చేయాలని రైతు విజ్ఞప్తి చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ప్రింటర్ విరాళం



ప్రిన్సిపాల్‌కు ప్రింటర్ మిషన్ అందజేస్తున్న క్లాస్-1 కాంట్రాక్టర్

బేతంచెర్ల, సెప్టెంబరు 19: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు క్లాస్-1 కాంట్రాక్టర్ అబ్దుల్ ఖాదర్ రూ.15 వేల విలువగల ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, సూపరింటెండెంట్ శిరీషలకు గురువారం ఆ ప్రింటర్‌ను అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 19: ఆళ్లగడ్డ నుంచి జమ్మలమడుగు వెళ్లే రహదారిలో అక్రమంగా తరలిస్తున్న 66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ నగిన గురువారం తెలిపారు. ఆళ్లగడ్డ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన నాగన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల, సెప్టెంబరు 19: పట్టణంలోని కోటపేటలో గురువారం నల్లబోతుల మహేశ్వరి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోటపేటకు చెందిన మహేశ్వరి ని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

శిరివెళ్ల, సెప్టెంబరు 19: మండలంలోని గోవిందపల్లె ఎస్సీ కాలనీకి చెందిన బద్రి శ్రీనివాసులు ఇంట్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన విషయం విదితమే. రైతు బద్రి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లి వచ్చేలోగా దుండగులు ఇంటి తలుపులు, బీరువాను ధ్వంసం చేసినట్లు బాధితుడు ఫిర్యాదు పేర్కొన్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. ఈ ఘటనలో బాధితుడికి చెందిన రూ.2.4 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదును దుండగులు అపహరించుకుని వెళ్లినట్లు ఎస్ఐ గురువారం వెల్లడించారు. దీంతో దొంగతనం ఘటనపై అన్ని కోణాల్లో విచారణ ముమ్మరం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూనియర్ కళాశాల రూపు రేఖలు మారుస్తాం



మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 19: ప్రభుత్వ జూనియర్ కళాశాల రూపు రేఖలు మారుస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్వాగతోత్సవ వేడుకలు నిర్వహించారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహ పూరితంగా మెలగాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచిచూడకుండా, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. రోడ్లు, భవనాల శాఖా మంత్రితో మాట్లాడి కళాశాల అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో సునీత, సీఐ మంజునాథరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



తోడెండ్లపల్లెలో కాలిపోతున్న గడ్డివామి

చాగలమర్రి, సెప్టెంబరు 19: మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో గురువారం తెల్లవారుజామున రైతు పాముల రమణకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. రాత్రి వేళలో గడ్డివామి దగ్ధం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంటలను ఆర్పి వేసేందుకు ప్రయత్నించారు. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని, రూ.50 వేలు నష్టం బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా సాయి పల్లకీ ఉత్సవం

చాగలమర్రి, సెప్టెంబరు 19: చాగలమర్రి గ్రామంలోని సాయినాథ మందిరంలో సాయి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లకిలో సాయిబాబా చిత్రపటాన్ని కొలువుదీరింప చేసి ఊరేగించారు. ఆలయంలో వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జల, క్షీరాభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా సాయి వ్రతం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు.

- రుద్రవరంలోని సంతాన వేణుగోపాలస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతాపారాయణం చేసి సంతాన వేణుగోపాలుడికి సత్యభామ రుక్మిణి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

హుండీ ఆదాయం రూ.7.38 లక్షలు

శిరివెళ్ల, సెప్టెంబరు 19: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా కొలువైన సర్వలక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు ద్వారా రూ.7.38 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో బీవీ నరసయ్య గురువారం తెలిపారు. ఇందులో ఆలయ కింది భాగంలో ఉన్న ఉపాలయ హుండీ ద్వారా రూ.1.38 లక్షలు, అలాగే ప్రధాన ఆలయంలోని హుండీల లెక్కింపు ద్వారా రూ.6 లక్షలు ఆదాయం వచ్చిందని చెప్పారు. దేవదాయశాఖ బనగానపల్లె డివిజన్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో అర్చకులు, మహదేవపురం, గుండంపాడు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సారా స్థావరంపై దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారా ఊట డ్రమ్ములతో ఎస్ఐ

రుద్రవరం, సెప్టెంబరు 19: హరినగరం సమీపంలో నాటుసారా బట్టీ ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ వర ప్రసాద్ గురువారం దాడులు నిర్వహించారు. దాడిలో ఐదు డ్రమ్ముల్లో నిల్వ ఉన్న 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బాలసాంబయ్యబావితాండ చెందిన నరసింహనాయక్ అనే నిందితున్ని అదుపులోకి తీసుకునికేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.